# అంబాసిడర్ కారు నడుపుకొంటూ..



విజయ చిహ్నం చూపుతూ నామినేషన్ వేసేందుకు వెళ్తున్న అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా

- బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బిగాల
- తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

ఖలీల్‌వాడి, నవంబర్ 9 : బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బిగాల గణేశ్ గుప్తా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నగరంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో కలిసి తన నివాసం నుంచి నామినేషన్ వేసేందుకు బయల్దేరారు. అంతకుముందు తన మాతృమూర్తి, అమ్మమ్మ దీవెనలు తీసుకున్నారు. నగరంలోని అయ్యప్ప స్వామి ఆలయం, నాందేవ్‌వాడలోని విఠలేశ్వర ఆలయం, మాక్లూర్‌లోని పాండురంగ విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మారుతీనగర్‌లోని తన నివాసం నుంచి తన సెంటిమెంట్ అయిన అంబాసిడర్ కారులో డ్రైవింగ్ చేసుకుంటూ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ మకరంద్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల, మేయర్ దండు నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎస్‌ఏ. అలీం, సుజిత్‌సింగ్ ఠాకూర్, సూదం రవిచందర్, సత్యప్రకాశ్, సిర్ప రాజు, ఎనుగందుల మురళి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అంబాసిడర్ కారును నడుపుతూ నామినేషన్ వేసేందుకు వెళ్తున్న బిగాల గణేశ్ గుప్తా

# జిల్లాలో 33 నామినేషన్లు దాఖలు

**జిల్లాలో ఇప్పటివరకు 70 నామినేషన్లు..**

ఖలీల్‌వాడి, నవంబర్ 9 : రాష్ట్ర శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి గురువారం 33 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఆర్మూర్ సెగ్మెంట్ నుంచి ఎస్‌కే మాజిద్ (మజ్లిస్ బచావో త్రెహీక్), ఆశన్నగారి జీవన్‌రెడ్డి (బీఆర్ఎస్), తాళ్లపల్లి శేఖరయ్య (విద్యార్థుల రాజకీయ పార్టీ), గండికోట రాజన్న (బీఎస్పీ), పి.వినయ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్) నామినేషన్లను సమర్పించారని తెలిపారు. బోధన్ సెగ్మెంట్ నుంచి పి.సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్), మోసిన్ (ఎం-సీపీఐ), డి.నాగరాజు (ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్), వి.మోహన్‌రెడ్డి (బీజేపీ), మహ్మద్ షకీల్ ఆమేర్ (బీఆర్ఎస్), షేక్ జలీల్ (స్వతంత్ర), సాయం మురళి (స్వతంత్ర) అభ్యర్థులుగా నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. బాన్సువాడ సెగ్మెంట్ నుంచి పరిగె భాస్కర్‌రెడ్డి (స్వతంత్ర), పందిర గంగామణి (స్వతంత్ర) అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు.

అర్బన్ నియోజకవర్గం నుంచి మహ్మద్ షబ్బీర్ అలీ (కాంగ్రెస్), బి.లలిత (స్వతంత్ర), పడకంటి రాము (స్వతంత్ర), దత్తురాం ఖతల్ (రాష్ట్రీయ సమాజ్ పక్ష), దండి లత (బహుజన్ లెఫ్ట్ పార్టీ), బిగాల గణేశ్ గుప్తా (బీఆర్ఎస్), ఫజల్ కరీం (ఎన్‌సీపీ), మహేశ్ బిగాల (బీఆర్ఎస్), ఎం. శివకుమార్ (స్వతంత్ర), ధన్‌పాల్ సూర్యనారాయణ (బీజేపీ), మహ్మద్ మన్సూర్ అలీ (అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేశారని వివరించారు. నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ (బీఆర్ఎస్), బాజిరెడ్డి జగన్మోహన్ (స్వతంత్ర), ఆర్. భూపతిరెడ్డి (కాంగ్రెస్), ఎం. శేఖర్ (బీఎస్పీ) అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గం నుంచి వేముల ప్రశాంత్‌రెడ్డి (బీఆర్ఎస్), పల్లికొండ నర్సయ్య (బహుజన సమాజ్‌పార్టీ) ఎం. భోజన్న (ధర్మసమాజ్ పార్టీ), ముత్యాల సునీల్ కుమార్ (కాంగ్రెస్) అభ్యర్థులుగా నామినేషన్ వేశారని వివరించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 70 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. ఆర్మూర్ సెగ్మెంట్ నుంచి ఇప్పటివరకు 11 నామినేషన్లు, బోధన్ సెగ్మెంట్ నుంచి 13, బాన్సువాడ నుంచి 8, నిజామాబాద్ అర్బన్ నుంచి 21, నిజామాబాద్ రూరల్ నుంచి 10, బాల్కొండ నుంచి 7 నామినేషన్లు దాఖలైనట్లు వివరించారు.

# ప్రజలకు చట్టాలను తెలియజేయడమే లక్ష్యం




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీ కల్మేశ్వర్, జిల్లా ప్రధానన్యాయమూర్తి సునీత కుంచాల

- సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల
- జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ

నిజామాబాద్ లీగల్, నవంబర్ 9 : చట్టాలను ప్రజలకు తెలియజేయడమే న్యాయసేవాధికార సంస్థ ప్రధానలక్ష్యమని సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని గురువారం నిర్వహించారు. నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్‌తో కలిసి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. న్యాయసేవా సంస్థ.. న్యాయసేవలతోపాటు సామాజిక సేవ అందజేస్తున్నదని అన్నారు. ప్రజల కోసం రూపొందించిన చట్టాలు, ప్రజల దరికి చేరే విధంగా ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. చట్టాలను అందరూ గౌరవించాలని కోరారు. చట్టవ్యతిరేకమైన చర్యలతో వ్యవస్థతో పాటు వ్యక్తులకు నష్టం వాటిల్లుతుందని, చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ర్యాలీలో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జిలు పద్మావతి, శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జి గోపీకృష్ణ, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చాండక్ దేవదాసు, ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, అడిషనల్, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లు జయరాం, కిరణ్ కుమార్, సీఐలు విజయ్‌బాబు, నరహరి, సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్, కాకతీయ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

# నిశిత కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ

ఖలీల్‌వాడి, నవంబర్ 9 : జిల్లా కేంద్రంలోని నిశిత డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ డేటా సైన్స్ విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీని గురువారం నిర్వహించారు. శ్రీలత గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన డ్యాన్స్‌లు, ఫ్యాషన్ షో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నిఖిల్, కో-ఆర్డినేటర్ రాజు, డైరెక్టర్ షేక్, ప్రిన్సిపాల్ స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ రఘువీర్, డేటా సైన్స్ విభాగాధిపతి మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.




డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

# 14న కార్తీక లక్ష దీపోత్సవం

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 9 : నగరంలోని గంగస్థాన్ ఫేస్ -2లో ఉన్న గణపతి సచ్చిదానంద ఆశ్రమాలయంలో ఈనెల 14న లక్ష దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఉత్తర తిరుపతి క్షేత్రం ట్రస్టీ సంపత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 8 గంటలకు లక్ష దీపోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కల్యాణం, 7 గంటలకు దత్త విజయానంద తీర్థస్వామి అనుగ్రహ భాషణం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# నగరంలో శ్రీవారి రథయాత్ర

- గోవింద నామస్మరణతో మార్మోగిన వీధులు



రథానికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 9 : 'కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం' రథయాత్రను నగరంలోని పలు ప్రధానవీధుల గుండా నిర్వహించారు. మహిళలు రథయాత్రకు మంగళహారతులతో స్వాగతం పలికారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో రథయాత్రను నగరంలోని ఎల్లమ్మగుట్టలోని ఎల్లమ్మ ఆలయం నుంచి ప్రారంభించారు. ఎల్లమ్మగుట్ట, పూలాంగ్ చౌరస్తా, గాయత్రీనగర్, ఆర్ఆర్ చౌరస్తా, వర్ని చౌరస్తా, గాజుల్‌పేట్, గురుద్వార్ మీదుగా వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వరకు రథయాత్ర కొనసాగింది. టీటీడీ ముద్రించిన హనుమాన్ చాలీసా పుస్తకాలు, కరపత్రాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్ష సేవాసమితి ప్రతినిధులు హనుమద్దాసు, పంచరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విజయ్ పాఠశాల వార్షికోత్సవం

- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఖలీల్‌వాడి, నవంబర్ 9 : నగర శివారులోని విజయ్ పాఠశాల 43వ వార్షికోత్సవాన్ని మామిడిపల్లి శివారులోని అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ అధికార భాషా సంఘం చైర్‌పర్సన్ మంత్రి శ్రీదేవి, గౌరవ అతిథులుగా సినీనటి రాజశ్రీ, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 43 ఏండ్లుగా పాఠశాలను నడుపుతూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నతస్థాయిలో ఉండేలా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ముఖ్యఅతిథులను విజయ్ పాఠశాల యాజమాన్యం సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి అమృతలత, తార, రమాదేవి, లలితాదేవి, విజయ భారతి, విజయలక్ష్మి, మధు, కరస్పాండెంట్ ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత, ప్రిన్సిపాల్ విజేత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న ముఖ్యఅతిథులు